# పరుగులేక వెలుగు లేదు...

బతుకుకూ పరుగుకూ విడదీయలేని సంబంధం ఉంది.

మనిషి పుట్టాక, నడక నేర్చాక, తీసేది పరుగే. బడిలో చేరేక కూడా పరుగే. స్కూలుకు లేటవుతామని ఇంటిదగ్గరనుంచి ఒకటే పరుగు. స్కూలు విడిచిపెట్టేక, ఇంటికి త్వరగా వెళ్ళి అమ్మ పెట్టే టిఫిన్ తిందామని అదే పరుగు.

"ఉప్మానూక అయిపోయిందిరా. కొట్టుకెళ్లి తెస్తావా" అని అమ్మంటే, 'ఓ' అని కిరాణా కొట్టుకు 'పీపీప' అని కారు స్టీరింగ్ తిప్పినట్టుగా గాల్లో చేతులు తిప్పుతూ అలసట ఎరుగని పరుగు.

వేసవికాలంలో పల్లెటూర్లో, చీకటితోనే లేచి సన్నటి పొడవాటి తాటాకుల బుట్టపట్టుకుని మామిడిచెట్ల దగ్గరకు పరుగో పరుగు. మామిడికాయలు ఏరి, చిలక్కొట్టుడు పండు దొరికితే, దాన్ని తిని, మళ్లీ ఇంటికి అదే పరుగు.

పిల్లల పరుగులు ఓ వింత అందం. ఆ పరుగు వాళ్ళ ఒంటికి చక్కని వెలుగు.




నల్ల మచ్చల తెల్ల లేగదూడ తల్లి దగ్గరికి పచ్చని చేలో పాల పరుగు.దాని మెడలో గంటల గణగణ ప్రకృతి పులకరించే సహజ సంగీతం,

ఆ లేగదూడ గిత్తయి, ఎద్దయి మెడపై సవారీ బండి కాడి మోస్తూ, పేడ వేస్తూ అలసట వచ్చినా.తప్పని పరుగు. కాస్త ఆగితే, కొరడా కొస చటుక్కుమనిపించి, మళ్లీ పరుగు.

ఒకప్పుడు ఎడ్ల పరుగే గొప్ప పరుగు. ఆతర్వాత గుర్రాల పరుగు మరీ గొప్ప పరుగు. రైలొచ్చాక అది గొప్ప పరుగు. విమానానిది మరీ గొప్ప పరుగు. అన్ని పరుగుల్లోనూ లాభముంది. ప్రమాదం జరిగితే నష్టమూ ఉంది.

మనిషి పరుగెట్టడానికి కాళ్ళూ చేతులూ ఎంత అవసరమో రైళ్ళూ, బస్సులూ పరుగెట్టడానికి చక్రాలు అంత అవసరం. గాల్లో పక్షులు పరుగెడతాయి. అందుకు వాటికి రెక్కలు అవసరం. విమానానికీ అంతే.

కాళ్ళూ చేతులూ లేని చెట్లు పరుగెట్టలేవు. రైల్లో వెళ్తున్నప్పుడు అవి పరుగెడుతున్నట్లు మనకు భ్రమ కలుగుతుంది. కాళ్లూ చేతులూ రెక్కలూ లేకపోయినా మేఘాలు ఆకాశంలో పరుగుపెడతాయి. అలాపరుగెట్టి పరుగెట్టి అలసిపోయి వర్షిస్తాయి. ఆవర్షం కొండలమీంచి కోనలలోంచి పరుగెట్టి నదులవుతాయి.. ఆ నదులు పరవళ్ళు తొక్కుతూ పరుగెట్టి సముద్రంలో కలుస్తాయి. ఆ నీరు ఆవిరై పరుగెట్టి మేఘమై మళ్ళీ పరుగెడుతుంది. సూర్యుడి చుట్టూ చంద్రుడూ పరుగెడుతూ గిరగిర తిరుగుతాడు.

భ్రమల్లో కూడా మనిషి పరుగెడతాడు. ఆకాశానికి నిచ్చెనలు వేసే ఆశబోతు అలాంటి పరుగులు తీస్తాడు. క్షణాల్లో కోటీశ్వరుడు అయిపోదామని షేర్లకోసం పరుగుతీస్తాడు. లంచాలు తీసుకుంటాడు. లంచాలు ఇస్తాడు, కోట్లు కూడగడతాడు. తీరా పట్టుబడితే ఊచలు లెక్కబెడతాడు. బయటకు రావడానికి కూడబెట్టిన కోట్లనుంచి కొంతనో అంతనో ఖర్చుపెడతాడు. ఈ పరుగు పందెంలో విజేత పరాజితుడవుతాడు. పరాజితుడు విజేత అవుతాడు.

అవును- బతుకే ఒక పరుగు పందెం. పొద్దుట లేచిందగ్గరనుంచి ఆఫీసు కెళ్ళుదాకా ఒకటే పరుగు. బస్‌స్టాప్‌కు పరుగు. బస్సెక్కిదిగేక ఆఫీసుకు పరుగు. ఆఫీసులో పోటీకి నిలబడి పరుగు. ఇంటికి వచ్చేదాకా అదే పరుగు. పట్నాల్లో నీళ్ళకు పరుగు. పాలకు పరుగు. రేషన్‌కు పరుగు. సినిమాకు పరుగు. అప్పులకు పరుగు. పరుగెత్తి పాలు తాగేకంటే నిలబడి నీళ్లు తాగడం మేలు అనే సామెత ఒకప్పుడు నిజమేకావచ్చు. ఇప్పుడు పరుగెట్టకపోతే నీళ్ళు కూడా దొరకవు.

పరుగుల్లో రకాలున్నాయి. కప్పా పరుగెడుతుంది. పామూ పరుగెడుతుంది. మేకా పరుగెడుతుంది. పులీ పరుగెడుతుంది. కప్ప తన ఆహారం కోసమేకాక, పాముకి ఆహారం కాకుండా ఉండడంకోసం పరుగెడుతుంది. పాము కప్పను మింగడానికే కాక, ముంగిసకు దొరకకుండా ఉండడానికి పరుగెడుతుంది. పులి, మేక కూడా అంతే. పచ్చిక బయళ్ళలో లేడి పరుగులో అందం ఉంటుంది. మేకపై పంజా విసరనంతవరకూ పులి పరుగులో అందం ఉంటుంది.

పరుగులోనూ వివక్ష చూపడం ఉంది. మగపిల్లలు పరుగెడితే ఆనందిస్తాం. ఆడపిల్లలు పరుగెడితే ఆక్షేపిస్తాం.

"ఆడపిల్లవు, ఏంటా పరుగు? ఒద్దికగా ఉండు'' అని మందలిస్తాం.

అదేమాట పిటి ఉషను ఆమెతల్లిదండ్రులు పదే పదే అని ఉంటే ఆమెపరుగుల రాణి అయ్యుండేది కాదు. బంగారు పతకాలు సాధించేదికాదు. అలాగే షైనీ అబ్రహాం పరుగుపందెంలో అంత గొప్పగా షైన్ అయ్యేది కాదు.

ఉష పరుగులో, షైనీ పరుగులో, మైకేల్ జాన్సన్ పరుగులో ఎంతటి అందం! ఆ అందం వాళ్ళ శరీరాల్లోనిది కాదు, పరుగులోనిది.

అవును సుమా, ఆనందమే అందం.

'పరుగులు తీసే నీ వయసునకు పగ్గంవేసెను నామనసు' అని నాటి హీరో హీరోయిన్లు ప్రేమగా చూస్తూ పాడతారు.

'పరుగులు తీసే చినదానా, కళ్ళెం వేస్తా కదలకు, పరుగులు పెట్టే చిన వాడా పళ్ళెం ఇస్తా వదలకు' అని నేటి హీరో, హీరోయిన్లు ఆడతారు.

అప్పుడు పార్కుల్లో పరుగెట్టే వారు. ఇప్పుడు కొండలు కోనలు ఎడారులా మనకడ్డంకి అని పరుగెడుతున్నారు.

దొంగప్రియుడు 'నువ్వే నాప్రాణం' అంటూ పరుగెడతాడు ప్రేయసి దగ్గరకి. ఆమెతో సరదా తీరాక, కట్నకానుకల కోసం మరొకామె దగ్గరికి పెళ్ళికోసం పరుగెడతాడు.

దొంగలు దొంగతనం చేశాక, ఎవరికీ దొరక కూడదని పరుగెడతారు. వాళ్ళని పట్టుకోడానికి పోలీసులు పరుగెడతారు.

దొంగకీ పరుగు అవసరం. పోలీసుకీ పరుగు అవసరం. దొంగ తన అవసరం కొద్దీపరుగెడతాడు. పోలీసు దొంగను పట్టుకునే తన డ్యూటీకోసం పరుగెడతాడు. దొంగకి పరుగు పరీక్ష ఇతరులు పెట్టరు. తన దొంగబుద్దే తనకు పరుగునేర్పుతుంది. పోలీసుకు ఉద్యోగం పరుగు నేర్పుతుంది.

పోలీసు ఉద్యోగానికి పరుగుకూడా ఒక అర్హత. ఫిట్‌నెస్ పరీక్షల్లో పరుగుకూడా ఉంటుంది. ఈ మధ్య ఒరిస్సాలో కానిస్టేబుళ్ళ ఉద్యోగాల నియామకంకోసం శారీరక పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా భారీ పరుగు పందాలు పెట్టారు. పాల్గొన్న వారిలో ఇరవై రెండుమంది పరుగెత్తి పరుగెత్తి నీరసించి సొమ్మసిల్లి పడిపోయారు. వాళ్ళను ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయించారు. అయినా ఒకడు చనిపోయాడు. కటక్ ఆస్పత్రిలో మరో పదిహేనుమందిని చేర్చారు. వీరిలో ముగ్గురు మరణించారు. మృతుల కుటుంబాలకు ఏభైవేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

మానవ శక్తిని మించే పరీక్ష పెట్టిన పోలీసు ఉన్నతాధికారి 'విజ్ఞత'కు నలుగురు బలయ్యారు. పోలీసు ఉద్యోగాలకు వచ్చిన వాళ్ళు పరుగెట్టి పరుగెట్టి అలసిపోయినా ఇంక పరుగెట్టలేమని అర్థమయినా పరుగాపితే ఉద్యోగం రాదేమోనని శక్తికిమించి పరుగెత్తబోయారు. కాళ్ళూ చేతులూ సహకరించకపోయినా, దమ్ము చాలక పోయినా కళ్ళముందు ఉద్యోగం కనిపించి, ఆ ఉద్యోగం వస్తే ఊపిరి పీల్చుకునే తమ కుటుంబాన్ని తలచుకొని పరుగెట్టారు.

ఇదీ బతుకు పరుగుపందెం. బతుకుకూ పరుగుకూ విడదీయరాని సంబంధం ఉంది. పరుగుతోనే వెలుగూ ఉంది. చీకటీ ఉంది. జీవితం లాగే పరుగుకూడా చీకటి వెలుగుల రంగేళీ.

20.9.96

వార్త దినపత్రిక,